

# మాకు నచ్చిన మా కథ!

కథలు ఎక్కువగా వస్తున్న రోజుల్లో కూడ ప్రయోజనాత్మక రచనలే లక్ష్యంగా కృషిచెయ్యటంవల్ల ఇంతవరకు వెలువడిన దాదాపు మూడు వందల యాభై రచనల్లో మాకు నచ్చినవి ఒకటికంటే చాలా ఎక్కువే ఉన్నాయి. వాటిని మళ్లీ మళ్లీ పరిశీలించి చివరకు యీ కథ- 'నీళ్లు' ఎంపికచేశాము.

కారణం ఉంది.



కాటూరు రవీంద్ర



త్రివిక్రమ్

ప్రాణావసరాలలో నీటికే మొదటిస్థానం ఉంది. ఈ రోజుల్లో నీటికరువు అనుభవించనివారు అరుదు. నీటికి దుర్భరమైన కరువు ఏర్పడినపుడు- ఆ విపత్కర పరిస్థితిలో మనుష్యుల మనస్తత్వాలు ఎలా ఉంటాయి? స్వార్థత్యాగాల్లో ఏది జయిస్తుంది? ఈ ప్రశ్నలు ఆలంబనంగా రచన సాగుతుంది.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30-10-74 సంచికలో యీ కథ ప్రప్రథమంగా ప్రచురితమై, పాఠకుల అభిమానాన్ని చూరగొనటం జరిగింది. కొందరు రచయితలు సైతం ఇతివృత్తాన్ని ప్రశంసించటంవల్ల, మరోమాటు దీనిని పాఠకుల ముందు ఉంచుతున్నాము. ఇది మీ అభిమానాన్ని మరోమాటు దోచుకుంటుందని మా నమ్మకం!

# నీళ్లు

"ఈ గాలి, నీరు, ఈ సమస్తం భగవంతుని అద్భుత సృష్టే. అవి దొరికినంత కాలం మానవుడి కవి మహోన్నత వరాలే. దొరక్కపోతే మాత్రం ఘోర శాపాలు!" వణుకుతున్న చేతులతో నశ్యం పీలుస్తూ అన్నారు అవధానిగారు.

మిగతావాళ్ళు "ఔ" నన్నారు.

"ఇప్పుడు మన ఊళ్ళో నీటికరువు సంగతే చూడండి! ఈ కటిక వేసవిలో స్నానం మాటలా ఉంచండి. గొంతు తడి చేసుకునేందుకు పుడిసెడు నీళ్ళు దొరకటం కష్టంగా ఉంది. బావుల్లో ఇసుక కనిపిస్తూంది. దిగుడు బావుల్లో గుంటలు తీసి, నీళ్ళు తెచ్చుకుంటున్నాం— అవునా?"

"దీని కంతకూ కారణం మనం చేసుకున్న మహా పాపం అంటారు అవధానిగారు!" వ్యంగ్యంగా అన్నాడు బి.ఎస్సీలో చదువుకొని వచ్చిన రామారావు.

"ఇది మనం చేసుకున్న పుణ్యమేనంటే నే నేమీ కాదనను." అతని కేసి మందహాసంతో చూశారు అవధానిగారు.

ఆ వీచికకు కొందరు నవ్వేశారు.

"ఇలాంటి శుష్కవాదాల వల్లనే మన దేశం పారిశ్రామికంగా, ఆర్థికంగా యుగాల వెనక నిలబడి ఉంది! చీమ కుట్టడానికి, కర్మసిద్ధాంతానికి ముడి పెట్టే మనం, ఏనుగులు దాడిచేస్తే ఏం రక్షించుకుంటాం?" ఆవేశం పొంగిన మోముతో అన్నాడు రామారావు.

"మా వా డంతే లెండి! పుస్తకాల్లో చదివిన పాఠాలు పరీక్షల్లో రాయక పోయినా మనదగ్గర బాగా అప్పజెపుతాడు." పిల్లనిచ్చి చదువు చెప్పిస్తే, జల్సాలు పోయి నాశనమయ్యాడన్న కడుపుమంటతో అన్నాడు మేనమామ మాణిక్యాలు.

రామారావు లేచి అవతలికి వెళ్ళిపోయాడు.

"ఎందుకలా అన్నారు? బాధపడడూ?" సుతిమెత్తగా అన్నారు అవధానిగారు.

ఘొల్లున నవ్వాడు మాణిక్యాలు.

"అదంటూ ఉంటే ఏనాడో డాక్టరయేవాడు!"

"నాకు తెలియక అడుగుతాను, ఇలాంటి కరువు సమయంలో క్రతువులు చేస్తే మంచిదంటారు. ఎంతవరకు నిజం?" మోతుబరి రైతు కృష్ణయ్యగారన్నారు అవధానిగారిని ఉద్దేశించి.

అవధాని పెదవులమీద చిరునవ్వు మెరిసింది.

"మంచిదే! కానీ, అందుకు పూనుకునేవాళ్ళెవరు?"

"పూనుకుంటే మాత్రం గంగని పొంగించే భగీరథు లెవ్వరు?" విశ్వపతి మాస్టారు అన్నాడు.

"అది నిజమే!" నిరుత్సాహపడ్డాడు కృష్ణయ్య.

"విశ్వపతిగారేం పుణ్యంచేశారో గానీ, ఊరంతటికీ ఆయన ఒక్క బావిలో రెండు చేదల నీరు ఊరుతుంది తెల్లవారేసరికి! ఒకదానితో స్నానపానాదులు చేసి, రెండోది కూజాలో నింపి ఉంచుకుంటారు."

"అదేమన్న మాటలెండి! రెండు చేదలు తోడుకున్నాక, చెంబు మునిగే నీళ్ళు ఉంటాయి. వాళ్ళ పీళ్ళని తేడాలేకుండా గూడెంవాళ్ళని సైతం తోడుకోమంటా రాయన."

"ఆయన మంచితనమే ఆయనకు వరం."

తల వంచుకుని చిరునవ్వుతో మౌనంగా ఉండిపోయాడు విశ్వపతి.

రావిచెట్టు ఉల్లాసంగా తల ఆడించింది.

సాయంత్రం కాగానే కాస్త పెద్ద తలకాయలన్నీ రచ్చపట్టున చేరతాయి.

చినుకు రాలక చవిటిపర్రలై పోతున్న భూమి గుండెలమీద కూర్చున్నందుకు ఆ వేదన వాళ్ళకూ సోకుతున్నది.

చాలామంది భూము లమ్ముకుని వలస వెళ్ళారు.

మమకారం మిగిలినవాళ్ళు కాళ్ళకు బంధాలు వేసుకుని కాలక్షేపం చేస్తున్నారు. కృష్ణయ్యగారి ఎడ్లబళ్ళు రోజూ నీళ్ళపీపాలు వేసుకుని దూరంగా ఉన్న కొండచెరువులోని నీళ్ళు అతి ప్రయాసమీద తీసుకువస్తుంటాయి.

ఆ నీళ్ళుకూడా బంగారంకన్న అపురూపంగా వినియోగించబడతాయి. వాళ్ళ పశువులు, కాపర్లు, ఇంట్లోవాళ్ళు, బంధుజనం! రావిచెట్టు లాంటి మనిషి గనక, నీడ దోచుకోవడానికి పోటీపడేవాళ్ళు కొల్లలు.

వాళ్ళలో కొందరు ఏ వేళ ఎలా వస్తుందోనని సర్దుకున్నా, "జీవన నౌకకు ఏ ఒడ్డయినా ఫర్వాలేదు లె"మ్మనుకునే వాళ్ళు మాత్రం అందరికన్నా నిశ్చింతగా కాలం గడుపుతున్నారు.

నీటికొరత వల్ల పక్షులు కూడా వలసలు వెతుక్కున్నాయి కాబోలు— ఇప్పుడా ఊళ్ళో వాటి సందడే లేదు. ఏదో, ఎప్పుడో నీరసంగా ఎగురుతూ ఓ కాకి కనిపిస్తుంది. దాని గొంతులో ఏదో విషాదం! మరో రామచిలక నిశ్శబ్దంగా

కూర్చుని దిక్కులు చూస్తుంటుంది. కాస్సేపు రామాలయం మీదున్న గూళ్ళలోకి తొంగిచూసి, ధ్వజ స్తంభం మీదకెక్కి చిరుగంటల్ని పలకరిస్తుంటుంది.

సుదూరాలకు వెళ్ళిరాగల కొంగలు మాత్రం రచ్చపట్టు కాధారమైన రావిచెట్టు మీదకు చీకటవేళ చేరుకుంటాయి. గాలి విసురుగా వీస్తే నిద్రలోంచి తుళ్ళిపడుతూ రెక్కలు సద్దు చేస్తుంటాయి.

"వెన్నెల మాత్రం ఏం గొప్పగా ఉంటుంది?"

దాహంతో అలమటిస్తున్న వాడిముందు ఆజ్యపాత్ర!

* * *

"నను బ్రోవమని చెప్పవే.... సీతమ్మ తల్లీ.... నను బ్రోవ...." విశ్వపతి నోట పాట ఆగిపోయింది. ఎదురుగా సుధాకరం.

ఆయనముందు భోజనం ఉంది.

ప్రారంభించబోతున్నాడు.

"ఏమిటోయ్, సుధాకరం? ఇంత రాత్రివేళ వచ్చావేం? రా రా. భోజనం చేద్దాం." అతనంటే విశ్వపతికి అమిత వాత్సల్యం. విద్యా వినయ సంపదల కతను ప్రత్యక్ష రూపమనిపిస్తాడు. స్కూలు నడిపిన రోజుల్లో అతని తెలివి తేటలు చూసి ముచ్చటపడేవాడు. "నువ్వు కష్టపడితే ఏ డాక్టరో, ఇంజనీరో అవుతావురా, సుధా!" అంటుండేవాడు తను.

'స్కూలు ఫైనల్'లో 'డిస్ట్రిక్ట్ ఫస్ట్' వచ్చి తను చెప్పినదానికి పునాది వేశాడు అటుపైన ఆర్థిక ఇబ్బందులవల్ల చదువు నిలిచిపోయింది.

"నేను మళ్ళీ వస్తాలెండి, మాస్టారూ! మీరు భోజనం చేయబోతున్నారు గద?" సంశయంగా ఆగిపోయాడు.

"అదేమిటోయ్, మరీ కొత్తవాడిలా? రా, ఇలా కూర్చో. నాతో చెప్ప విషయమేమిటో ఫర్వాలేదు."

"మీరు భోజనం ప్రారంభిస్తానంటేనే కూర్చుంటా! లేకపోతే నాకు సిగ్గుగా ఉంటుంది, మాస్టారూ."

"ఇంతకూ నువ్వు భోజనం చేసినట్టేనా?" దీపం వెలుగులో పరిశీలనగా మొహాన్ని చూస్తూ అడిగాడు.

"చేశాను, మాస్టారూ! మీరు కానివ్వండి." తలదించుకుని ముఖభావాలు దాచుకున్నాడు.

"అబద్ధం చెబుతున్నావు కదూ, సుధాకరం? తప్పు! నీ ఉపాధ్యాయుని

ముందు నిన్ను నువ్వు దాచుకోలేవు. నీవు చెప్పకపోయినా నేను ఊహించుకో గలను. ఇలా రా. ఇందులో కొద్దిగా వడ్డిస్తాను. మీ మాస్టారి చేతివంట రుచి చూడు" అంటూనే మరో కంచంలో అన్నం వడ్డించి, పచ్చడి వేశాడు.

సుధాకరం అభిమానంతో కుంచించుకుపోయాడు.

"నన్ను ఇబ్బంది పెడుతున్నారు, మాస్టారూ!" అతని మొహం సిగ్గుతో కందిపోయింది.

"నీ మనస్సు నాకు తెలుసు, నాయనా! కానీ, నా మనస్సుకూడా అర్థం చేసుకో. ఈ ఇంట్లో నా కెవ్వరున్నారు? వండిపెట్టేవాళ్ళ సంగతి అటుంచు. సరసన కూర్చుని తినేవాళ్ళు సైతం లేరు. ఇంతపెద్ద ఇంట్లో ఒక్కణ్ణీ రాత్రులు గడపాలంటే.... నవ్వుతున్నావు కదూ! లేదు, బాబూ! నేను పిరికి వాణ్ణి కాదు. స్వాతంత్ర్యం కోసం నేనూ జైళ్ళల్లో మగ్గినవాణ్ణే. తమాషా ఏమిటంటే— నాకు ఆ జైలే ఈ ఇంటికన్న వెయ్యిరెట్లు బాగుంది. అక్కడ పిలిస్తే పలికేవాళ్ళున్నారు. చావకుండా మందులిచ్చేవాళ్ళున్నారు. ఇక్కడ ఏ అర్ధరాత్రివేళో 'గుండెనొప్పి' వస్తే మాత్రలందించేవాళ్ళు సైతం లేరు. ఒంటరి తనం ఇలాంటిది కదా అనుకుంటుంటాను. తిను, బాబూ. రా! నీకు తండ్రిలేని మాట నిజమే. నాకు బిడ్డలులేని మాటా వాస్తవమే. మేధగల మనుషులమైనందుకు మన మధ్య ఈపాటి బావబంధాలు ఏర్పడకపోవటం భగవత్ సృష్టికే అవ మానం."

సుధాకరం మరోమాట పలకలేదు.

భోజనాలు అయినాక ఆరుబయట మంచాలమీద కూర్చున్నప్పుడు అడిగాడు: "ఇప్పుడు చెప్పు, ఇందాక వచ్చిన పనేమిటి?"

"మిమ్మల్నో సలహా అడగటానికి వచ్చాను."

"దానిదేముంది? అడుగు."

"నేను పైలట్‌గా వెళదామనుకుంటున్నాను."

విశ్వపతి మెల్లగా నవ్వాడు.

"కలలు కంటున్నావా, సుధాకరం?"

"నేను పైలట్‌గా పనికిరానంటారా, మాస్టారూ?" గాయపడినట్లు అడిగాడు.

"ఆ సంగతి నిర్ణయించేందుకు నే నెవర్ని? అదికాదు నా ఉద్దేశ్యం. నీ తల్లినీ, నీ తరవాత నలుగుర్నీ ఈ ఊళ్ళో కాటకానికి అప్పగించి, నువ్వు పైలట్‌వై తిరిగొచ్చేవరకు వాళ్ళని కాపాడమని ఏ దేవుణ్ణి కోరదలిచావు?"

"మిమ్మల్నే, మాస్టారూ!"

"నన్నా?" విశ్వపతి అవాక్కయాడు.

చటుక్కున ఆయన పాదాలు స్పృశించాడు సుధాకరం. అతని కళ్ళవెంట అశ్రుధారలు.

"మీకు తెలియందేముంది, మాస్టారూ? ఇక్కడే మసవుతాను గానీ మరో ఊరు రానంటుంది మా అమ్మ. అమ్మని బట్టే మిగతావాళ్ళూ కదా? నే నప్పటికీ ఎన్నో విధాల చెప్పిచూశాను, బస్తీ తీసుకెళ్ళి ఏదో విధంగా పోషిస్తానని. 'ససేమిరా' అంది. చివరి కీ నిర్ణయానికి రాక తప్పిందికాదు. మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తారనే ఆశతో వచ్చాను."

విశ్వపతి చలించాడు.

"లే, సుధాకరం! ముందు పాదాలు వదులు. ఆ శ్రీరామచంద్రుడిలా నిర్ణయిస్తే కాదనటాని కెవరం మనం? నిన్ను నిండుమనసుతో ఆశీర్వదిస్తున్నాను, బాబూ. ఆ రాముడు నిన్నెప్పుడూ కాపాడాలి. ఆయన నా కిచ్చిన శక్తి దాచుకోకుండా, నేను చేయగలిగిన సాయమంతా చేస్తాను. సరా?"

"జనజన్మలకీ మీకు ఋణపడి ఉంటాను, మాస్టారూ!"

"నా కెక్కడుంది నాయనా అంత అర్హత? అంతా ఆయన లీల." చేతులు జోడించాడు ఆలయం దిశవైపు చూస్తూ.

"ఈ రాత్రే వెళదామనుకుంటున్నాను, మాస్టారూ!"

"ఏమిటి? ఇంత రాత్రా?"

"వెన్నెలే కద, మాస్టారూ. వెళ్ళగలను. పగలయితే తలో రకంగా వ్యాఖ్యానాలు చేస్తారు. అమ్మ అసలు ఒప్పుకోదు!"

"అంటే, మీ అమ్మకి...."

"మీరే నచ్చచెప్పాలి, మాస్టారూ!" తల దించుకున్నాడు.

"సరే. ఉండు, ఇప్పుడే వస్తాను." లోపలికి వెళ్ళి రెండునిముషాల్లో తిరిగి వచ్చాడు. "ఇవిగో ఇవి ఉంచు, అవసరాని కుంటాయి." కొన్నినోట్లు చేతిలో ఉంచాడు.

"మాస్టారూ!"

భుజంమీద ఆప్యాయంగా తట్టి, "నాకు తెలుసు నాయనా! నువ్వు నోరు తెరిచి అడగలేదని నేను ఊరుకోగలనా? ఉండు. నువ్వు ఈ రాత్రివేళ ఎన్ని

మైళ్ళు నడిచివెళ్ళాలో! మరచెంబులో నీళ్ళు నింపి ఇస్తాను" అని మళ్ళీ లోప లికి వెళ్ళాడు విశ్వపతి.

సుధాకరానికి మాటలు కరువైనాయి. అలాగే బొమ్మలా ఉండిపోయాడు. విశ్వపతి మరచెంబు, ఓ చిన్న సంచీ తెచ్చి ఇచ్చాడు. "ఇందులో తుండు గుడ్డలూ, అద్దరు పంచెలూ ఉన్నాయి. లేకపోతే ఇబ్బందిపడిపోతావు."

మరోమాటు కాళ్ళకు చుట్టుకుపోయాడు సుధాకరం.

"మాస్టారూ, మీరు నిజంగా దేవుళ్ళు. మళ్ళీ మీలాంటివాళ్ళు నాకు దొరకరు. ఎక్కడ వెతికినా దొరకరు." అని అతని గొంతు రుద్ధమైంది.

జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి అప్యాయంగా నిమిరి, "లేచి వెళ్ళిరా, బాబూ! నాదేముంది, ఈవేళో రేపో రాలిపోయే ఎండుటాకుని. నీకు ఉజ్జ్వల భవిష్యత్తు ఉంది. దాన్ని సవ్యంగా నడిచి నిలబెట్టుకో. ఇదే నా సలహా" అన్నాడు విశ్వపతి.

"వస్తాను, మాస్టారూ! మీ కిచ్చిన శ్రమకు మన్నించండి. వస్తాను."

"మంచిది, వెళ్ళిరా!" కళ్ళు తుడుచుకున్నాడు_విశ్వపతి.

వెన్నెట్లో మంచంమీద నడుం వాల్చాడు.

నిజమయిన అప్యాయత, నిస్వార్థమయిన సహాయం ఇంకెంత బాగుం టాయి! ఒకరికి తోడ్పడటంలో ఎంత ఆనందం, తృప్తీ ఉన్నాయి!

ఆయన కళ్ళమీద వెన్నెల కిరణాలు వెలుగుతున్నాయి.

పదిలంగా వాటిని కనురెప్పల ఖజానాలో దాచుకున్నాడు.

* * *

"ఇయ్యాల పంతులారు నీళ్ళు తోడలేదేంది! సెంబెడు నీల్లొచ్చేయి, ఇయ్యేల సాద మునిగిపోతాందేంటి?"

"ఒలేయ్.... ఉండుండొసే. ఆ మారాజు నడిగొస్త.... తోడబోకు" అని వెళ్ళిన వెర్రి మంగమ్మ గాభరాగా కేకపెట్టేసరికి అందరూ రివ్వున వెళ్ళారు.

విశ్వపతి నేలమీద బోర్లా పడున్నాడు. గుండెదగ్గరగా ఒక చెయ్యి, నీళ్ళులేని కూజా దగ్గర ఒక చెయ్యి, నేలమీద చెల్లాచెదురుగా ఉన్న మందు బిళ్ళలు, పగిలిన సీసా.

ఆయన నాలుక బయటికి వచ్చి, తపన చల్లారిపోయి నిశ్చలంగా ఉంది!

——